25 శాతం సీట్ల భర్తీకి మళ్లీ అవకాశం

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

రానున్న విద్యా సంవత్సరంలో ప్రైవేట్ అన్ఎయిడెడ్ పాఠశాలల్లో 25 శాతం సీట్లను కేటాయించేందుకు రెండో విడత ప్రకటన జారీ చేసినట్టు డిఇఒ ఎస్.అబ్రహాం తెలిపారు. 2023-2024 విద్యాసంవత్సరంలో విద్యా హక్కు చట్టం ప్రకారం రాష్ట్రంలోని వెనుకబడిన వర్గాలు, అనాథ, హెచ్ఐవి బాధిత, వికలాంగులు, బలహీన వర్గాలు, ఎస్సి, ఎస్టి వర్గాలకు చెందిన పిల్లలకు 1వ తరగతిలో ప్రైవేట్ అన్ఎయిడెడ్ పాఠశాలల్లో 25 శాతం సీట్లను కేటాయించడం గురించి ఆన్లైన్ దరఖాస్తులు ఆహ్వానించిన సంగతి తెలిసిందే. ఆన్లైన్ దరఖాస్తుల స్వీకరణకు 06.05.2023 నుంచి 15.05.2023 గడువు ఉన్నట్టు తెలిపారు. పూర్తి వివరాలకు http://cse.ap.gov.in సైట్ అందుబాటులో ఉందని తెలిపారు.

పెరిగిన విద్యుత్ వాడకం

- ఉమ్మడి జిల్లాలో 4 మిలియన్ యూనిట్ల పెంపు
- రోజుకు 20 మిలియన్ యూనిట్లకు పైగా వినియోగం
- విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

జిల్లాలో పెరుగుతున్న ఉష్ణోగ్రతల నేపథ్యంలో విద్యుత్ వినియోగానికి రెక్కలు వచ్చాయి. అందుకు అనుగుణంగా కేటాయింపులు లేకపోవడంతో విద్యుత సరఫరాలో సమస్యలు తలెత్తుతున్నట్టు ఆయా వర్గాల సమాచారం. ఈ క్రమంలోనే అనధికారికంగా కోతలు అమలవుతున్నాయి. దీంతో ఉక్కపోతతో వినియోగదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. సరఫరాలో అంతరాయాలకు సాంకేతిక సమస్యలే కారణమని, ఆ సమస్యలను త్వరితగతిన పరిష్కరించి సరఫరా పునరుద్ధరిస్తామని విద్యుత్ శాఖ అధికారులు చెబుతున్నారు. జిల్లాలో రోజువారీ విద్యుత వినియోగం 20 మిలియన్ యూనిట్లకు పైగానే ఉంది. కేటాయింపులు మాత్రం 19 మిలియన్ యూనిట్లేనని తెలుస్తోంది. ఫలితంగా విద్యుత్ అంతరాయాల సమస్య తలెత్తుతోంది. అప్రకటిత కోతల కారణంగా ప్రజల ఇబ్బందులు పడుతున్నారు.

జిల్లావ్యాప్తంగా పెరిగిన వినియోగం

ఉమ్మడి జిల్లాలో 19.16 లక్షల విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. వీటిలో 16.23 లక్షల గృహ కనెక్షన్లు ఉన్నాయి. వీటితోపాటు, వాణిజ్యం, పరిశ్రమలు, తాగునీటి కనెక్షన్లు, వీధిలైట్లు తదితర కనెక్షన్లు 3.07 లక్షలు ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలో ప్రస్తుతం రోజువారీ 20 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం జరుగుతోంది. ఫిబ్రవరి నెలలో 16 నుంచి 17 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం జరిగింది. మార్చిలో 17 నుంచి 18 యూనిట్ల మధ్య వినియోగం జరిగింది. తాజాగా ఏప్రిల్ నెలలో 18 మిలియన్ యూనిట్ల నుంచి 20 మిలియన్ యూనిట్లకు పెరిగింది. గడిచిన మూడు నెలల్లో సరాసరి నాలుగు వేల మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం ఒక్కసారిగా పెరిగినట్లు అధికారులు గణాంకాలు చెప్తున్నాయి. సాధారణంగా ఎండాకాలంలో విద్యుత్ కేటాయింపులు కొంత ఎక్కువగానే ఉండాలి. వేసవి కాలంలో సాగు విస్తీర్ణం తగ్గుతుందన్న నెపంతో కేటాయింపులు తగ్గించినట్లు ఆయా వర్గాల ద్వారా తెలుస్తోంది.

అప్రకటిత కోతలు షురూ

జిల్లాలో విద్యుత్ వినియోగం కంటే కేటాయింపులు తక్కువగా ఉండటంతో ఇటు గృహాలు, అటు వ్యవసాయానికి సరఫరా అయ్యే విద్యుత్లో కోతలు పడుతున్నాయి. వ్యవసాయానికి రెండు విడతల్లో 9 గంటల విద్యుత్ సరఫరా చేయాల్సి ఉండగా.. సరాసరిన అరగంట నుంచి గంట సమయం వివిధ సాకుల పేరుతో కోత పెడుతున్నట్టు రైతులు చెబుతున్నారు. దీనికి తోడు కరెంటు ఎప్పుడు వస్తుందో.. ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితుల్లో రైతులు పడిపోయారు. ఇక గృహాలకు సంబంధించి అనధికారికంగానే కోతలు అమలవుతున్నాయి. దీంతో వినియోగదారులకు కరెంటు కష్టాలు తప్పడం లేదు. డిమాండ్కు తగ్గట్లుగా సరఫరా చేసేలా చర్యలు చేపట్టాలని వినియోగదారులు కోరుతున్నారు.

అంతరాయాల్లేని విద్యుత్ సరఫరా

వేసవి నేపథ్యంలో జిల్లాలో విద్యుత్ వినియోగం పెరిగింది. గతేడాది వినియోగాన్ని అంచనా వేసుకుని ముందుగానే ప్రణాళికలు సిద్ధం చేసుకున్నాం. ఆ మేరకు అవసరమైన చోట్ల ట్రాన్స్ఫార్మర్లు కెపాసిటీ పెంచాము. 1,100 కొత్త ట్రాన్స్ఫార్మర్లు ఏర్పాట్లు చేశాము. మే నెలలో 21 మిలియన్ యూనిట్లకు డిమాండ్ పెరుగుతుందని అంచనా వేస్తున్నాం. అంచనాకు తగ్గట్లుగా సరఫరా ఉంది. ఎక్కడైనా ఫీజులు పోయి ఇబ్బందులు తలెత్తితే వెంటనే పరిష్కరించేందుకు సిబ్బందిని షిఫ్టుల వారీగా 24 గంటలు అందుబాటులో ఉంచాము. అంతరయాలు లేకుండా విద్యుత్ సరఫరా అందజేస్తున్నాం.

- పివిఎస్ఎన్.మూర్తి, ఎస్ఇ, విద్యుత్ శాఖ, తూర్పుగోదావరి.

అకాల వర్షంతో రైతుల్లో ఆందోళన

మధ్యాహ్నం వరకు ఎండ, ఉక్కబోతతో ఉన్న వాతావరణం ఒక్కసారిగా మబ్బులు కమ్మి ఈదురు గాలులతో, భారీ వర్షం కురిసింది. శనివారం కురిసిన భారీ వర్షంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కోతల దశలో ఉన్న ధాన్యాన్ని కాపాడుకునేందుకు అవస్థలు పడుతున్నారు. ఉద్యాన పంటలు, కూరగాలయ పంటలు పలుచోట్ల ధ్వంసమయ్యాయి.

ప్రజాశక్తి - యంత్రాంగం

ఉండ్రాజవరం కళ్లాలపై ధాన్యాలు ఉన్న రైతులు పొలాలకు పరుగులు తీశారు. మరో రెండు రోజులపాటు వర్ష సూచన ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు చేయడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలో అక్కడక్కడా జరిగిన పంట నష్టం అంచనా వేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. **గోపాలపురం** భారీ గాలి దుమ్ము, వర్షానికి మామిడి తోటలు, అరటి తోట రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. ఎండకు ఆరబెట్టిన ధాన్యం గుట్టలు తడిసి పోయాయి. కరిచర్లగూడెం, నందిగూడెం గ్రామాల పరిధిలో ఒక కౌలు రైతుకు చెందిన రెండెకరాల అరటి తోట సుమారు 20 రోజుల్లో అరటి గెలలు కోత కోయాల్సి ఉండగా పంట చేతికొచ్చి సమయంలో గాలి దుమ్ముకు అరటి తోట నేలమట్టం అయిందని ఆవేదన చెందాడు. డ్రైనేజీలు పొంగాయి, లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. **తాళ్లపూడి** మండలంలో ఆకాశం మేఘావృతమై భారీ ఈదురుగాలులు వీచాయి. భారీ ఈదురుగాలుల కారణంగా మండలంలోని పెద్దేవం గ్రామంలో భారీ వక్షం నేల కూలింది. ఈ సమయంలో అటుగా వెళ తున్న ఆటో తటిలో తప్పించుకోవడంతో భారీ ప్రమాదం తప్పింది.

తాళ్లపూడిలో..

గోపాలపురంలో నేలంటిన అరటి

గిట్టుబాటు ధర కోసం రైతుల ధర్నా

ప్రజాశక్తి-కడియం

కష్టపడి పండించిన పంటను కొనే నాథుడు కరువయ్యాడని, గిట్టుబాటు ధర అందడం లేదని కడియం కెనాల్ రోడ్డు బొబ్బిలి బ్రిడ్జి సెంటర్లో శనివారం సాయంత్రం రైతులు ఆందోళన చేపట్టారు. భారీ వాహనాలు నిలిచిపోవడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఒకానొక దశలో పోలీసులు, రైతుల మధ్య తీవ్ర తోపులాట చోటు చేసుకుంది. పోలీసుల తీరుపై రైతులు, నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక్కడ పండిన ధాన్యం అనపర్తి మండలంలోని రైస్ మిల్లులకు అమ్మాల్సి వస్తోందని, దూరం కావడంతో రవాణా ఖర్చులు అధికమవుతున్నాయని, స్థానిక రైస్ మిల్లులకు ధాన్యం అమ్మేలా ఏర్పాట్లు చేయాలని రైతులు డిమాండ్ చేశారు. ధాన్యం ముక్కలుగా విరిగిపోయి, నూకశాతం ఎక్కువగా ఉందంటూ రూ.100, రూ.150 తగ్గిస్తున్నారని, పైగా ఆ సొమ్ములు రైతులను జమ చేయాల్సిందిగా రైస్ మిల్లుల వారు డిమాండ్ చేస్తున్నారన్నారు. రైస్ మిల్లుల దోపిడీని తట్టుకోలేకపోతున్నామని వారు వాపోయారు. అక్కడకు చేరుకున్న స్థానిక అధికారులు సర్దిచెప్పే ప్రయత్నం చేసినా రైతులు ఆందోళన విరమించలేదు. రాజమహేంద్రవరం రూరల్ ఎంఎల్ఎ గోరంట్ల బుచ్చయ్య చౌదరి రైతుల వద్దకు చేరుకుని చర్చించారు. ఉన్నతాధికారులకు సమస్యను వివరించారు. జిల్లా సివిల్ సప్లైస్ మేనేజర్, డిఎస్ఒ రైతుల వద్దకు చేరుకుని అన్ని విషయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కషి చేస్తామని, ఆదివారం నుంచి స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో నూక శాతం నిర్ధారణ చేసే మిషన్, సిబ్బందిని అందుబాటులో ఉంచుతామని, క్వింటాకు 4 కేజీల మించి తరుగు ఉండబోదని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు.

కడియంలో ధర్నా చేస్తున్న రైతులు

సచివాలయ ఉద్యోగుల సమస్యలపై ధర్నా

ప్రజాశక్తి- ధవళేశ్వరం

సచివాలయ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఎపిజెఎసి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు క్రాంతి ప్రసాద్, శివ డిమాండ్ చేశారు. ఎపిజెఎసి అమరావతి రెండో దశ కార్యాచరణ ప్రణాళికలో భాగంగా శనివారం అమరావతి తూర్పు గోదావరి జిల్లా శాఖ నేతత్వంలో జెఎసి భాగస్వామ్య సంఘాలతో కలిసి బొమ్మూరులోని కలెక్టరేట్ వద్ద ధర్నా చౌక్లో గ్రామ వార్డు సచివాలయాల ఉద్యోగుల సమస్యలపై ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో క్రాంతి ప్రసాద్, ప్రధాన కార్యదర్శి ఎఆర్.శివకుమార్ మాట్లాడుతూ మొదటి దశలో నియామకం జరిగిన గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల 9 నెలల కాలానికి చెందిన బకాయిలు, రెండో విడతలో నియామకం అయిన గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల 5 నెలల కాలానికి చెందిన బకాయిలు వెంటనే చెల్లించాలని కోరారు. గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులకు సాధారణ బదిలీలు వెంటనే కల్పించాలని డిమాండ్ చేశారు. గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల మీద రోజువారీ నిర్దేశించిన పౌరసేవలు లక్ష్యాలు, పని ఒత్తిడి తగ్గించాలని కోరారు. ఈ ధర్నాలో సచివాలయాల సంఘం నాయకులు జగ్గారావు, ఎంజీ అహ్మద్, సురేష్ కుమార్, మున్సిపల్ టీచర్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కెనడీ బాబు, సచివాలయాల ఉద్యోగులు, ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.

ఉగ్రం సినిమా యూనిట్ సందడి

ప్రజాశక్తి-రాజానగరం

వచ్చే నెల 5న షైన్ స్క్రీన్ బ్యానర్పై విడుదల కానున్న ఉగ్రం సినిమా ప్రమోషన్లో భాగంగా ప్రముఖ హీరో అల్లరి నరేష్, హీరోయిన్ మిర్న మీనన్, డైరెక్టర్ విజయ్ ఐఎస్టిఎస్ మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం సందడి చేశారు. హీరో నరేష్ మాట్లాడుతూ యాక్షన్ థ్రిల్లర్తో కుటుంబ సభ్యులతో కలసి సినిమా చూడవచ్చు నన్నారు. కళాశాల చైర్మన్ ఉపేందర్ రెడ్డి ఉన్నారు.

ఆస్తి పన్ను రాయితీ నేటితో ముగింపు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

రాష్ట్ర ప్రభుత్వం ఆస్తి పన్నులో కల్పించిన 5 శాతం రాయితీ శనివారంతో ముగియనుందని నగరపాలక సంస్థ కమిషనర్ శనివారం తెలిపారు. ఆదివారం చెల్లింపుదారుల సౌకర్యార్థం నగరపాలక సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన అదనపు కౌంటర్లతో పాటు, వివిఎల్.పురం సచివాలయం నెం.23, ప్రకాష్ నగర్ మీసేవ కేంద్రంలోని సచివాలయం నెం.14, సీతంపేట మీ-సేవా కేంద్రంలోని సచివాలయం నెం.81, కోటిపల్లి బస్టాండ్ మీసేవాలోని సచివా లయం నెం.36, నారాయణపురం సచివాలయం నెం.3, బొగ్గులదిబ్బ సచివాలయం నెం.42లోని కౌంటర్లలో ఉదయం 6 గంటల నుండి రాత్రి 9 గంటల వరకు పన్ను చెల్లించవచ్చునని తెలిపారు.

రేషన్ పంపిణీపై సమీక్ష

ప్రజాశక్తి -దేవరపల్లి

స్థానిక మండల కార్యాలయంలో రేషన్ డీలర్లు, రేషన్ వాహనదారుల సమావేశం శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అధ్యక్షుడు కెవివకె.దుర్గారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు, డీలర్లకు పలు సూచనలు సలహాలు అందజేశారు ఈ కార్యక్రమంలో తహశీల్దారు ఎం.రామకృష్ణ, జగదాంబ, ఎంపిడిఒ శర్మ పాల్గొన్నారు.

ప్రజల మద్దతు వైసిపికే : మంత్రి వనిత

ప్రజాశక్తి-కొవ్వూరు రూరల్, తాళ్లపూడి

దేశంలో ఏ రాష్ట్రంలోనూ నిర్వహించని విధంగా వైసిపి మెగా పీపుల్ సర్వే నిర్వహించిందని.. గతంలో, భవిష్యత్తులో ఏ పార్టీ కూడా ఇంత ధైర్యం చేయలేదని రాష్ట్ర హోమ్ శాఖ మంత్రి డాక్టర్ తానేటి వనిత తెలిపారు. జగనన్నే మా భవిష్యత్తు మెగా పీపుల్స్ సర్వే వివరాలను శనివారం మంత్రి క్యాంప్ కార్యాలయంలో వివరాలను ఆమె వెల్లడించారు. జగనన్నే మా భవిష్యత్' మెగా సర్వేలో భాగంగా కొవ్వూరు నియోజకవర్గంలో మొత్తం 79,007 కుటుంబాలకు 72,635 కుటుంబాలను సందర్శించామన్నారు. సర్వేకు రాష్ట్ర వ్యాప్తంగా 1.45 కోట్ల కుటుంబాలు ఇచ్చిన మద్దతు, ప్రజలకు ప్రభుత్వంపై ఉన్న విశ్వాసం మరింత పెంచేలా అదే శక్తి, అదే ఉత్సాహంతో సుపరిపాలనను కొనసాగి స్తామన్నారు. ప్రతిపక్ష టిడిపి వాపుని చూసి బలం అనుకుంటుందని విమర్శించారు. ప్రతిపక్షాలకు నిజంగా దమ్ము ధైర్యం ఉంటే ప్రజల వద్దకు ఎందుకు వెళ్లలేకపోతున్నారని ప్రశ్నించారు. కుల, మత, వర్గ, వివక్ష లేకుండా అందరికీ సంక్షేమం అందిస్తున్నామని తెలిపారు. వైసిపి ఏప్రిల్ 7న రాష్ట్ర వ్యాప్తంగా 15 వేల సచివాలయాల్లో 'జగనన్నే మా భవిష్యత్తు' పేరుతో మెగా పీపుల్స్ సర్వే ప్రారంభించిందన్నారు. ఈ కార్యక్రమంలో 7 లక్షల మంది పార్టీ సైనికులు ప్రతి ఇంటినీ సందర్శించారన్నారు. ఎంఎం జగనన్నపై ప్రజలకు ఉన్న నమ్మకం మాటల్లో చెప్పలేనిదని, ప్రజల నుంచి అపూర్వ ఆదరణ లభిస్తోందని తెలిపారు. నవరత్నాల హామీలను 100 శాతం నెరవేర్చిన సిఎం జగనన్న ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని హోమ్ మంత్రి తెలిపారు. రాష్ట్రంలో అందరి అభివద్ధితో రాష్ట్రాన్ని దేశంలోనే మొదటి స్థానంలో ఉంచాలన్న ఆలోచనతో జగనన్న అనేక సంక్షేమ పథకాలు ప్రారంభించి అమలు చేస్తున్నారని హోమ్ శాఖ మంత్రి డాక్టర్ తానేటి వనిత అన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా తాళ్లపూడి మండలంలోని అన్నదేవరపేట గ్రామంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి పాల్గొని లబ్ధిదారులను స్వయంగా కలుస్తూ రాష్ట్రంలో అమలవుతున్న లబ్ధిదారులకు అందుతున్న సంక్షేమ పథకాలను అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాలకు అర్హులైన వారిని గుర్తించాలని అధికారులకు సూచించారు. గ్రామానికి వచ్చిన మంత్రి వనితకు వైసిపి నాయకులు ఘన స్వాగతం పలికారు.

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి వనిత

రెండుచోట్ల నవోదయ పరీక్ష

ప్రజాశక్తి-కడియం, గోపాలపురం

కడియం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం జవహర్ నవోదయ ప్రవేశపరీక్ష ప్రశాంతంగా నిర్వహించినట్టు ఎంఇఒ వి.లజపతిరాయ్ తెలిపారు. ఆరో తరగతిలో చేరేందుకు నిర్వహించే ఈ పరీక్షకు ప్రస్తుతం ఐదో తరగతి చదువుతున్న 216 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా, 192 మంది హాజరయ్యారని తెలిపారు. నవోదయ విశ్వవిద్యాలయం పెద్దాపురం నుంచి వి.వెంకటరమణ పరీక్షా కేంద్ర పరిశీలకులుగా హాజరయ్యారని, చీఫ్ సూపరింటెండెంట్గా స్థానిక హెచ్ఎం టి.సత్యనా రాయణ వ్యవహరించారని ఆయన తెలియజేశారు. గోపాలపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 275 మంది విద్యార్థులు పరీక్షకు రావలసి ఉండగా 240 మంది హాజరైనట్టు హెచ్ఎం పి.సోమశేఖర్ తెలిపారు. 35 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు తెలిపారు. బాలురు, బాలికల తల్లిదండ్రులు నలుమూలల నుంచి పెద్ద ఎత్తున పరీక్షా కేంద్రానికి చేరుకున్నారు.

కార్టూ'నిజం'



జెఇఇ మెయిన్స్లో తిరుమల ప్రభంజనం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా నిర్వహించిన ప్రతిష్టాత్మక జెఇఇ మెయిన్స్ పరీక్షల్లో రాజమహేంద్రవరంలోని తమ తిరుమల ఐఐటి అండ్ మెడికల్ అకాడమీ విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధించినట్టు తిరుమల విద్యా సంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు. వివిధ కేటగిరీల్లో జాతీయ స్థాయిలో తమ విద్యార్థులు కె.వివేకవర్ధన్ 2వ ర్యాంకు, పి.శ్రీజ 29వ ర్యాంకు, వి.నందినీదుర్గ 32వ ర్యాంకు, డి.యువాన్ గేట్స్ 46వ ర్యాంకు, జిడిపిఎస్ఎస్.శరణ్ 47వ ర్యాంకు, ఎం.రాహుల్ 74వ ర్యాంకు, ఎల్డి.వర్ధన్ 81వ ర్యాంకు, ఎస్వి.సహాని 96వ ర్యాంకు, కెజి.ధనశ్రీ 111వ ర్యాంకు, వివిఎస్ఎస్.తేజశ్విని 145వ ర్యాంకు, జివిఎస్జిఎన్.వర్షిత్ 163వ ర్యాంకు, ఎస్.సుష్మ 189వ ర్యాంకు, సిహెచ్.రాజీవ్చన్ 192వ ర్యాంకు, 500 లోపు 33 మంది, 1000లోపు 51 మంది, 5000లోపు 190 మంది, 10000 లోపు 319 మంది, 20000 లోపు 515 మంది ర్యాంకులు సాధించారని తెలిపారు. కోచింగ్ తీసుకున్న విద్యార్థుల్లో 1,248 మంది అడ్వాన్స్ పరీక్షకు అర్హత పొంది 95.8 శాతం సక్సెస్ రేటు సాధించారని ఆయన తెలిపారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను అకడమిక్ డైరెక్టర్ జి.సతీష్బాబు, ప్రిన్సిపల్ వి.శ్రీహరితో కలిసి ఆయన అభినందించారు.

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి వనిత

పాఠశాలకు ఆర్ఒ ప్లాంట్ అందజేత

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

విద్యార్థుల మనోవికాసానికి, శారీరక దృఢత్వానికి క్రీడలు ఎంతగానో తోడ్పడతాయని తణుకు సత్యనారాయణ స్పిన్నింగ్ మిల్ నిర్వహణాధికారి బాలకృష్ణ అన్నారు. సిఆర్ఎస్ పథకంలో భాగంగా ఉండ్రాజవరం జెడ్పి పాఠశాలకు డైనింగ్ హాల్లో మినరల్ వాటర్ యూనిట్ను స్పిన్నింగ్ మిల్ యాజమాన్యం తరపున బహూకరించినట్టు పాఠశాల హెచ్ఎం విశ్వ ప్రసాద్ శనివారం తెలిపారు. గ్రామ సర్పంచ్ మెండే వెంకటరావు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ సోంబాబు, మినరల్ వాటర్ ప్లాంటును ప్రారంభించారు.

వెంకన్నబాబుపై అసత్య ఆరోపణలు

ప్రజాశక్తి-గోపాలపురం

ద్వారకాతిరుమల వైసిపి నాయకులు బొండాడ వెంకన్నబాబును దళిత వ్యతిరేకిగా చిత్రీకరిస్తూ కొంతమంది అసత్య ఆరోపణలు చేస్తున్నారని వైసిపి గోపాలపురం నియోజకవర్గ దళిత నాయకులు సాలి వేణు, కొడవటి బుజ్జిబాబు ఖండిస్తూ శనివారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా సాలి వేణు మాట్లాడుతూ తప్పుడు సమాచారంతో సోషల్ మీడియాలో అపోహలు సష్టించడం దారుణమన్నారు.

5న సిఎం పర్యటన ఏర్పాట్లపై సమీక్ష

ప్రజాశక్తి-కొవ్వూరు రూరల్

మే 5న కొవ్వూరులో 'వాలంటీర్కు వందనం' రాష్ట్ర స్థాయి వేడుకలను అత్యంత పటిష్టంగా నిర్వహించడంలో శాఖల మధ్య సమన్వయం ముఖ్యమని కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత స్పష్టం చేశారు. శనివారం స్థానిక ఆర్డిఒ కార్యాలయంలో సిఎం పర్యటన ఏర్పాట్లపై జెసి ఎన్.తేజ్ భరత్, డిఆర్ఒ జి.నరసింహంతో కలిసి కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. అధికారులతో సమన్వయం చేసుకోవడం ద్వారా సిఎం పర్యటనను విజయవంతం చేయాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను, కార్యక్రమాలను ప్రజలకు క్రమ పద్ధతిలో సకాలంలో చేరువ చెయ్యడంలో వాలంటీర్ల యొక్క పాత్ర ప్రధానమైనదన్నారు. అటువంటి వాలంటీర్ సేవల గుర్తింపుగా వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వేసవి దష్ట్యా తగిన మెడికల్ క్యాంపులు, అత్యవసర మందులు, ఒఆర్ఎస్ ప్యాకెట్లు సిద్ధం చేసుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఆర్టిసి, రవాణా శాఖ అధికారులు తగిన వాహనాలు సిద్ధం చేసుకొని ఆయా మండలాలకు ముందస్తుగా రూట్ మ్యాప్ మేరకు చేరుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వేసవి దృష్ట్యా రోడ్ షో, బహిరంగ సభ వద్ద తగిన 108 అంబులెన్స్ వాహనాలు, మెడికల్ క్యాంపు, మెడికల్ సిబ్బంది అందుబాటులో ఉంచాలన్నారు. ఆయా నియోజకవర్గాల వారీగా స్థానిక ప్రజా ప్రతినిధులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో ఆర్డిఒలు ఎస్.మల్లి బాబు, ఎ.చైత్రవర్షిణి, డిసిహెచ్ఒ డాక్టర్ ఎం.సనత్ కుమారి, సిపిఒ కె.ప్రకాష్ రావు, డ్వామా పీడీ జిఎస్.రామగోపాల్, డిపిఒ పి.జగదాంబ, జిల్లా రవాణా అధికారి కె.కృష్ణారావు, డిఎల్డిఒ పి.వీణా దేవి, డిఎస్ఒ పి.ప్రసాద రావు, పలువురు జిల్లా శాఖల అధికారులు పాల్గొన్నారు.

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

విద్యా దాతల సేవలు అభినందనీయం

ప్రజాశక్తి-కడియం

విద్యాదాతలు సేవలు అభినందనీయమని పలువురు ఉపాధ్యాయులు పేర్కొన్నారు. నిరంతరం విద్యాభివృద్ధికి పేద విద్యార్థుల చదువు ప్రోత్సహం కోసం ఎన్నో చేయూత కార్యక్రమాలు చేస్తున్న ప్రముఖ నర్సరీ రైతు, నర్సరీ అసోసియేషన్ పూర్వ అధ్యక్షులు పుల్లా ఆంజనేయులు (అబ్బులు)ను పలువురు ఉపాధ్యాయులు సత్కరించారు. శనివారం సత్యదేవా నర్సరీలో ఆంజనేయులను ఘనంగా సత్కరించారు. ఆయన చేస్తున్న సేవా కార్యక్రమాలను ఈ సందర్భంగా కొనియాడారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర, జిల్లా, మండల నేతలు ఇవివిఎస్ఆర్ ప్రసాద్, ఆకుల వీర్రాజు, చిలుకూరి శ్రీనివాసరావు, అల్లాడ బాలాజీ, హనుమంతరావు, వనజ, అబ్బాయి, కె.వెంకటేశ్వర రావు, వేదుల శాస్త్రి, రాఘవ, చోడిశెట్టి బాలాజీ, బంగారు నాయుడు, నర్సరీ రైతులు పుల్లా రాజశేఖర్, పిండి నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

రేపు తహశీల్దారు కార్యాలయంలో స్పందన

ప్రజాశక్తి-గోపాలపురం

స్థానిక తహశీల్దారు కార్యాలయంలో సోమవారం జరిగే మండల స్థాయి స్పందన కార్యక్రమానికి ప్రజలు ప్రజా సమస్యలు తెలిపి పరిష్కారం పొందాలని తహశీల్దారు బి.రవీంద్రనాథ్, ఎంపిడిఒ ఆర్.శ్రీదేవి ప్రకటనలో తెలిపారు. సోమవారం తహశీల్దారు కార్యాలయంలో స్పందన కార్యక్రమం 10 గంటల నుంచి ప్రారంభిస్తున్నట్లు తెలిపారు.

రెండు బస్సులు ఢీకొని డ్రైవర్లు, విద్యార్థులకు స్వల్ప గాయాలు

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

లారీ డ్రైవర్ లారీని నిర్లక్ష్యంగా నడుపుతూ సడన్ బ్రేక్ వేసి ఆపడంతో వెనకనే వస్తున్న ఒక కళాశాల బస్సు, ఆర్‌టిసి బస్సులు ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో బస్సుల డ్రైవర్లు, విద్యార్థులకు స్వల్ప గాయాలయినట్లు స్థానికులు, పోలీసులు తెలిపారు. శనివారం ఉదయం వేట్లపాలెం వైపు నుంచి సామర్లకోట వైపు వస్తున్న లారీని డ్రైవర్ ఒక్కసారిగా సడన్ బ్రేక్ వేసి ఆపడంతో లారీ వెనకనే వస్తున్న విద్యార్థులతో ఉన్న ఒక ప్రైవేట్ కళాశాల బస్సు లారీని ఢీ కొట్టింది. అదే బస్సుకు వెనుక వస్తున్న ఆర్‌టిసి బస్సు కూడా కళాశాల బస్సును వెనుక నుండి ఢీ కొట్టడంతో ఈ ప్రమాదంలో రెండు బస్సుల డ్రైవర్లకు, పలువురు విద్యార్థులకు స్వల్ప గాయాలయ్యాయి. గాయపడిన వారిని గ్రామంలోని పిహెచ్‌సికి చికిత్స నిమిత్తం తరలించారు. ఘటనపై కేసు స్థానిక పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ మెడలో గొలుసు చోరీ

ప్రజాశక్తి - గండేపల్లి

సినిమా ఫక్కీలో మహిళ మెడలో తాడును చోరీ చేసిన దుండగులు పరారయ్యారు. గండేపల్లి మండలం మురారి గ్రామ శివారు ఎన్‌హెచ్16 రోడ్డు పక్కన అంబటి బుల్లి వెంకట్రావు, అతని భార్య గజేకర పాన్‌షాప్ నిర్వహిస్తున్నారు. శుక్రవారం మధ్యాహ్నం సుమారు మూడు గంటల సమయంలో ఎవరో ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు మోటార్ సైకిల్‌పై పాన్ షాప్ కు వచ్చి ఆమెను సోడా అడిగారు. ఆమె సోడా బాటిల్ ఇస్తుండగా అకస్మాత్తుగా వారు ఆమె మెడలోని మూడు కాసుల మంగళసూత్రాలు గల బంగారు తాడును తెంపుకుని మోటార్ సైకిల్ పై పరారయ్యారు. సంఘటనపై గజేకర వెంకట్రావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గండేపల్లి ఎస్ఐ వై.గణేష్ కుమార్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

విద్యుత్ షాక్‌కు గురై వ్యక్తి మృతి

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

విద్యుత్ షాక్ కు గురై వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన శుక్రవారం తాతపూడిలో జరిగింది. అంగర ఎస్ఐ బి.చంటి శనివారం తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన కూచి శ్రీనివాసు కిషోర్ ఈ నెల 28న తాతపూడి లోని అంబేద్కర్ కమ్యూనిటీ హాల్ వద్ద చేస్తుండగా విద్యుత్ షాక్ కు గురయ్యాడు. సమాచారం అందుకున్న అతని తండ్రి సూరిబాబు ఘటనా స్థలానికి వెళ్లేటప్పటికే కిషోర్ మృతి చెందాడు. సూరిబాబు ఫిర్యాదు మేరకు అదే రోజు కేసు నమోదు చేసినట్లు ఎస్ ఐ తెలిపారు.

నలుగురిపై బైండోవర్ కేసులు

ప్రజాశక్తి-తాళ్లపూడి

మండల పరిధిలోని రెండు గ్రామాల్లోపాత సారా కేసులకు సంబంధించి నలుగురిపై బైండోవర్ కేసులు నమోదు చేసి తహశీల్దార్ బి.రాధిక ఎదుట హాజరు పరిచినట్లు కొవ్వూరు సెబ్ సిఐ సత్యనారాయణ తెలిపారు. అన్నదేవరపేట చెందిన మల్లెల రమేష్, జి.ఎం.రాజు, టి.బంగారయ్య, పెద్దేవం గ్రామానికి చెందిన దెయ్యాల శ్రీనులపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

శ్రీ బాంధవి ని అభినందిస్తున్న దొరబాబు

విద్యార్థినికి దొరబాబు అభినందన

ప్రజాశక్తి - పెద్దాపురం

ఇంటర్మీడియట్ 2023 ఫలితాల్లో సామర్లకోట ప్రగతి కళాశాలకు చెందిన విద్యార్థిని కె శ్రీబాంధవి ఎంపిసి విభాగంలో 470 మార్కులకు 467 మార్కులతో స్టేట్ ఫస్ట్ సాధించింది. ఈ సందర్భంగా శనివారం స్థానిక రామారావుపేటలోని వైసిపి కార్యాలయంలో రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు ఆమెను సత్కరించి అభినందించారు. మున్సిపల్ చైర్ పర్సన్ బొడ్డు తులసి మంగతాయారు, బైక్ చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు ఒఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ

ప్రజాశక్తి- కరప

ఉపాధి హామీ చట్టంలో పనిచేస్తున్న కూలీలకు కరప గ్రామ సర్పంచ్ సాదే ఆశాజ్యోతి కుమార్ ఒఆర్ ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేయడం జరిగింది. శనివారం ఉపాధి కూలీల వద్దకు వెళ్లి సర్పంచ్ ఆశాజ్యోతి పనులు చేస్తున్న కూలీలు వడదెబ్బ తగలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచిం చారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు

ప్రజాశక్తి-తాళ్లపూడి

తాళ్లపూడి బస్టాండ్ సెంటర్లో శనివారం కూలింగ్ చలివేంద్రాన్ని శనివారం మండల మానవతా శాఖ గౌరవాధ్యక్షులు సింహాద్రి జనార్దన్ రావు ప్రారంభించారు. అధ్యక్షులు జోడాల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ తక్కువ ధరకు చల్లని మంచినీటిని అందించడానికి ముందుకు వచ్చిన ఆర్కే వాటర్ యాజమాన్యం రాధాకృష్ణకు అభినందనలు తెలియజేశారు. వి.చంద్రయ్య, సిహెచ్.ఆంజనేయులు, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న అధ్యాపక బృందం, ప్రముఖులు

శ్రీ చైతన్య ప్రైమరీలో గ్రాడ్యుయేషన్ డే

ప్రజాశక్తి - కాకినాడ

శాంతినగర్ శ్రీ చైతన్య ప్రైమరీ విభాగంలో గ్రాడ్యుయేషన్ సెలబ్రేషన్స్ జరిగాయి. పాఠశాల రీజినల్ ఇంచార్జ్ పి.గోపీనాథ్, కె2 ప్రిన్సిపల్ సుల్తాన్ పాల్గొన్నారు. ఐదో తరగతి విద్యార్థులకు నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఉమాలక్ష్మి విద్యార్థులను అభినందిస్తూ మాట్లాడారు. అతిథిగా సుల్తాన్ మాట్లా డుతూ విద్యా ర్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలన్నారు. అటువంటి లక్ష్యాన్ని ఏర్పరిచేది తల్లిదండ్రులే అన్నారు. ప్రైమరీ ఇన్చార్జ్ విశ్వ ప్రియ, విద్యార్థి తల్లిదండ్రులు అధ్యాపక బృందం పాల్గొన్నారు.

యానాం వార్తలు

నీటి మట్టాన్ని పరిశీలిస్తున్న ఎంఎల్ఎ అశోక్

తాగునీటి ఎద్దడి నివారణకు ముందస్తు చర్యలు

ప్రజాశక్తి - యానాం

యానాం నియోజకవర్గ పరిధిలో తాగునీటి అవసరాలను తీర్చే 55 ఎకరాల చెరువులను శనివారం ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ పరిశీలించారు. పిల్లంక - బ్రహ్మపురి ఫ్రెంచ్ కెనాల్ నుంచి వస్తున్న నీరు 55 ఎకరాల చెరువులో నిండుతున్న తీరును పరిశీలించారు. నియోజకవర్గ పరిధిలో తాగు నీటి ఇబ్బందులు రాకుండా ముందస్తుగా చర్యలు తీసుకున్నామని, ఆ దిశగా కాకినాడ జిల్లా కలెక్టర్ తో సమస్య గూర్చి అనేక సార్లు విన్నవించామని ఎంఎల్ఎ అశోక్ తెలిపారు. అంతే కాక ధవళేశ్వరం ఇరిగేషన్ అధికారులను వారి కార్యాలయంలో కలసి వంతుల వారీ ప్రత్యేక నీటి సరఫరాకు ఇవ్వాలని కోరినట్లు దానికి వారు పూర్తిగా సహకరించారన్నారు. అన్ని ప్రయత్నాలు ఫలిం చడంతో నీరు వస్తుందన్నారు. ప్రజలు నీటిని పొదుపుగా వాడాలని విజ్ఞప్తి చేశారు.

నూకరాజు కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎంఎల్ఎ అశోక్

పలువురికి ఎంఎల్ఎ పరామర్శ

యానాం నియోజకవర్గంలోని ఇటీవల అనారోగ్య కారణంగా మృతి చెందిన వారి కుటుంబాలను శనివారం ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ పరామర్శించారు. గణపతి నగర్ నివాసి పిడబ్ల్యుడి ఎప్టి సిఎల్ఆర్ ఉద్యోగి పంపన నూకరాజు చికిత్స పొందుతూ మరణించాడు. వారి కుటుంబాన్ని, ఫరంపేట వాసి విద్యుత్ శాఖలో బిల్ కలెక్టర్‌గా పని చేసిన కర్రి విజయ కుమారి, గొల్లల వీధికి చెందిన మరుకుర్తి రామకృష్ణ లు మరణించడంతో వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

శృంగార వల్లభుని ఆలయానికి రూ 3.66 లక్షల ఆదాయం

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం మండలం తిరుపతిలోని శ్రీ శృంగార వల్లభ స్వామి ఆలయాన్ని శనివారం అధిక సంఖ్యలో యాత్రికులు సందర్శించారని ఆలయ ఇఒ పులి నారాయణమూర్తి తెలిపారు. శనివారం ఒక రోజు వివిధ టిక్కెట్ల ద్వారా రూ 3,66,536, అన్నదానం విరాళాల ద్వారా రూ 59,046, కేశఖండన ద్వారా రూ 9,400 ఆదాయం సమకూరిందన్నారు. యాత్రికులకు ఉదయం పులిహార ప్రసాదం,మధ్యాహ్నం మహా అన్నదానం నిర్వహించామన్నారు. యాత్రికులకు అర్చకులు, ప్రజా ప్రతినిధులు కుంచే బుచ్చిరాజు,కర్రి జగదీష్, ఆలయ సిబ్బంది కృష్ణ, మోహన్ రావు, సత్యనారాయణ, స్వచ్ఛంద సేవకులు అంజనీ కుమార్, గ్రామ ప్రజలు సహాయ సహకారాలు అందించారన్నారు.

నవోదయ పరీక్షకు 282 మంది హాజరు

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

పెద్దాపురం జవహర్ నవోదయ విద్యాలయలో ఆరో తరగతి ప్రవేశ పరీక్షలను శనివారం నిర్వహించారు. పరీక్షకు 282 మంది విద్యార్థులు హాజరయ్యారు. మండలానికి సంబంధించి స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రంలో శనివారం ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంటన్నర వరకు పరీక్ష నిర్వహించారు. మొత్తం 325 మంది విద్యార్థులు హాజరుకావల్సి ఉండగా, వారిలో 43 మంది హాజరుకాలేదు. పరీక్షాకేంద్రాన్ని మండల స్థాయి స్క్వాడ్ అధికారి ఎంఇఒ వై శివరామకృష్ణయ్య పరిశీలించారు. పరీక్షా కేంద్రం ఛీఫ్ సూపరింటెండెంట్ హెచ్‌ఎం ఎన్ కొండారెడ్డి, సెంటర్ పరిశీలకులుగా నవోదయ విద్యాలయ నుండి ఎం భాస్కరరావులు విధులు నిర్వహించారు.

ఆలిండియా జెఇఇ టాపర్‌గా రోహన్ శివ తేజ

ప్రజాశక్తి - కరప

రోహన్ శివతేజ

కరప గ్రామానికి చెందిన వడ్డీ రోహన్ శివతేజ ఆల్ ఇండియా జెఇఇ పరీక్షలో 99.92 ఉత్తీర్ణతతో 952వ ర్యాంకు సాధించి టాపర్గా నిలిచారని తండ్రి వడ్డీ వెంకటేశ్వరరావు తెలిపారు. జనవరి నెలలో జరిగిన మొదటి సెషన్ 99.88% సాధించగా ఈ నెలలో జరిగిన చివరి దైన రెండవ సెషన్ లో 99.92% కు పర్సంటేజ్ ను మెరుగుపరుచుకుని ఆలిండియా స్థాయిలో 952 వరకు సాధించాడు. చదువులో చిన్నప్పుడు నుండి చురుగ్గా ఉండి రోహన్ గతంలో ఏపీ పాలిటెక్నిక్ లో రాష్ట్రస్థాయి 19వ ర్యాంకు సాధించాడు.ఈ సందర్భంగా రోహన్ మాట్లాడుతూ మా తల్లిదండ్రులు ఉపాధ్యాయులు కావడంతో ప్రిపరేషన్‌లో మెలకువలు నేర్పుతూ కష్టపడి చదివే విధంగా ప్రోత్సహించారని రోహన్ శివతేజ తెలిపారు. జూన్ నెలలో జరగబోయే జేఈఈ అడ్వాన్స్ లో మంచి ర్యాంకు సాధించి ప్రతిష్టాత్మక ముంబై ఐఐటీలో కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ చెయ్యాలన్నది తన చిరకాల స్వప్నమని రోహన్ శివతేజ తెలి పారు. తండ్రి ఉపాధ్యాయులుగా కరప నక్కవారిపేట స్కూల్లో పనిచేస్తుండగా తల్లి కాజులూరు మండలంలో ఉపాధ్యాయనిగా పనిచేస్తున్నారు.

పారిశుధ్య పనులపై ఎడిసి పరిశీలన

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

కాకినాడ నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ సిహెచ్ నాగ నరసింహారావు శనివారం నగరంలో జరుగుతున్న పూడికతీత పనులను పర్యవేక్షించారు. జగన్నాధపురం 17వ డివిజన్ పరిధిలోని ఉమెన్స్ కళాశాల ప్రాంతంలో డి సిల్టేషన్ పనులు, 20వ డివిజన్లోని మేకల కబేళా ప్రాంతంలో కూడా పూడిక తీత పనులను కూడా ఆయన పరిశీలించారు. వర్షాలు పడే లోపుగా అన్ని కల్వర్టులు, మేజర్ డ్రైన్ లలో పూడికతీత పూర్తి చేసి, ఇంజనీరింగ్, పారిశుధ్య విభాగాలు సమన్వయంతో ఈ ప్రక్రియను యుద్ధ ప్రాతిపదికిన చేపట్టి పూర్తి చేయాలన్నారు. ఆయన వెంట శానిటరీ ఇన్స్పెక్టర్లు రెడ్డి, ధర్మాజీ, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రజలను మోసగించడమే వైసిపి ఎజెండా

ప్రజాశక్తి - కాకినాడరూరల్

రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లోని ప్రజలను మోసగించడమే వైసిపి ఏజెండా అని కాకినాడ రూరల్ మాజీ ఎంఎల్ఎ పిల్లి అనంతలక్ష్మి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి పిల్లి సత్యనారాయణమూర్తి విమర్శించారు. కాకినాడ రూరల్ నియోజకవర్గం కాకినాడ కార్పొరేషన్లో 49 వ డివిజన్లో మంగళవారం ఇంటింటికి మీ అనంతలక్ష్మి, ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాలను నిర్వహించారు. రాష్ట్రం పురోభివృద్ధి సాధించేందుకు టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు మళ్లీ సీఎం కావలసిన అవసరం ఎంతైనా ఉందని అనంతలక్ష్మి, సత్యనారాయణ మూర్తి ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో పాలిక ఉషారాణి, సూర్య ప్రకాష్, కాకర్లపూడి రాజేష్ వర్మ, సాగిరాజు సూరిబాబు రాజు, దాట్ల రవి బుజ్జి, పెనుమత్స బంగారు రాజు, మంతెన రవి వర్మ, పలివెల త్రిమూర్తులు, గాయత్రి కోణాల కృష్ణ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

పాలకుల లోపం.. ప్రజలకు శాపం

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

ప్రభుత్వ నిర్లక్ష్యం విద్యార్థుల పాలిట శాపంగా మారింది. విద్యా వ్యవస్థ అభివృద్ధికి కోట్లాది రూపాయలు వెచ్చిస్తున్నాం అంటూ పాలకులు చేసిన ఆర్భాటపు ప్రచారాలకు తాజా ఫలితాలు నిలువుటద్దం పట్టాయి.

మొదటి సంవత్సరం ఫలితాలలో జిల్లాకు ఆరవ స్థానం లభించగా, రెండో సంవత్సర ఫలితాలలో ఎనిమిదవ స్థానానికే పరిమితం అయ్యారు. గత ఏడాదితో పోల్చితే ఫలితాలు కొంత మెరుగైనట్లు కన్పిస్తున్న ప్పటికీ ఈ ఏడాది పూర్తి స్థాయిలో తరగతులు నిర్వహించారు. ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ప్రత్యేక కసరత్తు చేపట్టామని ఇంటర్మీడియెట్ విద్యా మండలి ప్రకటించింది. అయితే ఆచరణలో పూర్తి భిన్నమైన పరిస్థితులు నెలకొన్నాయి. ప్రభుత్వ కళాశాలల్లో అధ్యాపకుల కొరత వేధించింది. బొమ్మూరు ఎంఎంజి కాలేజీలో ఉత్తీర్ణత సాధించకపోవటానికి ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని ఆ కాలేజీ ఎదుట విద్యార్థులు, తల్లిదండ్రులు చేపట్టిన ఆందోళన జిల్లాలో చర్చనీయంశమైంది. ఉన్నతాధికారుల జోక్యంతో ఆందోళన సద్దుమనిగింది. మండలానికి ఒక మహిళా కాలేజీ అమలుకు నోచుకోలేదు. అత్యధిక కాలేజీలలో అధ్యాపకులను కేటాయించకపోవటంతో విద్యార్థులు అడ్మిషన్లు సమీప కాలేజీలకు తరలి వెళ్లారు. మరో వైపు పాఠ్యపుస్తకాల పంపిణీ చేయక పోవటతో విద్యార్థులు అధిక ధరకు బహిరంగ మార్కెట్లో కొనుగోలు చేయలేక కేవలం రన్నింగ్ నోట్స్‌మీదే ఆధారపడినట్లు తెలుస్తోంది. ఈ సమస్యలను చక్కదిద్దాలని విద్యార్థి సంఘాలు, తల్లిదండ్రులు, విద్యార్థులు పలు మార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయింది. దీంతో ఫలితాలపై తీవ్ర ప్రభావం కన్పించింది. కేజీబీవీలలో పూర్తిగా వెనుకబాటు కన్పించింది.

వరి రైతులకు కన్నీళ్లు .....కడగండ్లు

ఓ వైపు ప్రకృతి వైపరీత్యాలు... మరో వైపు ధాన్యం కొనుగోలులో ప్రభుత్వ నిబంధనల పేరుతో రైస్ మిల్లర్ల వేధింపులు జిల్లాలోని రైతులకు కష్టాలను , కడగండ్లను మిగుల్చుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో దాదాపుగా సాగు తుది దశకు వచ్చింది. దీంతో రైతులు ముమ్మరంగా కోతలు ప్రారంభమయ్యాయి. ఈ వారంలో కురిసిన అకాల వర్షాలకు కోనసీమ, కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాలోనూ పంటనష్టం వాటిల్లింది. రైతులు కష్టం నీటి పాలైందని ధాన్యం కొనుగోలు చేసి ఆదుకో వాలని విజ్ఞప్తి చేస్తున్నారు. మరో వైపు తేమ శాతం అధికంగా ఉందంటూ రైస్ మిల్లర్లు ధాన్యం బస్తాలను దిగుమతి చేసుకోవటంలేదు. ఈ క్రమంలో గోకవరం మండలంలో రైతులు చేపట్టిన ఆందోళనతో యంత్రాంగం దిగొచ్చింది. జెసి తేజ్ భరత్ చొరవతో రైస్ మిల్లర్లు ఎట్టకేలకు ధాన్యం దిగుమతి చేసుకునేందుకు అంగీ కరించారు. కొనుగోలు కేంద్రాలు ఆలస్యంగా ప్రారంభించ టంతో అధిక శాతం మంది ఇప్పటికే దళారులకు విక్రయించామని, వర్షాలు కురుస్తున్న క్రమంలో అధికారులు త్వరితగతిన కొనుగోలు చేయకుంటే పూర్తిగా నష్టపోతామని రైతులు వాపోతున్నారు.

మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో సేవలు శూన్యం...

పన్నులు వసూళ్లు ఘనం

ఆర్థిక సంవత్సరం ముగింపు పేరుతో జిల్లాలోని కార్పొరేషన్‌లు, మున్సిపాలిటీల అధికారులు ప్రజల గోళ్లూడపీకేలా వేధిస్తూ పన్నులు వసూళ్ల పరంపర కొనసాగిస్తున్నారు. ఆస్థి పన్నులు చెల్లించని వారి ఆస్తులు జప్తు చేస్తామంటూ రాజమహేంద్రవరం కార్పొరేషన్ పరిధిలో ఓ ప్రైవేట్ వెహికల్ ద్వారా ప్రచారం చేయటంతో ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. గతంలో ఖాళీ స్థలాల పన్నులు చెల్లించకుంటే స్వాధీనం చేసుకుంటామంటూ ప్రకటన బోర్డులు ఏర్పాటు చేయటంతో రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశమైన విషయం విధితమే. సాధారణంగా ప్రతి ఏటా మార్చి 31 గడువు తేదీ తెలిసిన విషయమే. ఈ ఏడాది ఈ నెల 30 వరకూ పొడిగించి వసూళ్లు చేపట్టారు. దీంతో క్షేత్రస్థాయి సిబ్బంది ప్రజల వెంటపడి మరీ వసూళ్ల పరం పర తెరలేపారు. 5 శాతం పన్ను రాయితీ చెప్పినప్పటికీ ఆచరణలో నేతి బీర చందంగా మారింది. దీనిపై పట్టణ వాసుల నుంచి విమర్శలు వచ్చినా కార్పొరేషన్‌లు, మున్సిపాలిటీల సిబ్బంది వెనుకడుగు వేయలేదు. ఏప్రిల్ 1 నుంచి కొత్త పన్ను విధానం అమలు చేసినట్లు కార్పొరేషన్ అధికారులు జవాబిస్తున్నారు. గత ఏడాదితో పోల్చితే అత్యధికంగా పన్నుల వసూలు జరిగినట్లు అధికారుల గణాంకాలు చెబుతున్నారు. ఓ వైపు నిత్యావసర సరుకుల ధరల పెంపు, మరో వైపు పన్నుల మోత గోరుచుట్టుపై రోకలిపోటులామారాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాలకుల తీరును విమర్శిస్తున్నారు.

సిపిఐ, సిపిఎం చేపట్టిన ప్రచార భేరికి విశేష మద్దతు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై సిపిఐ, సిపిఎం సంయుక్త ఆధ్వర్యంలో ఉమ్మడి కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన విషయం విధితమే. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా చేపట్టిన నిరసనలు, ఆందోళనలు, ప్రచార కార్యక్రమాలకు విశేష స్పందన లభించింది. ప్రజలు తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులను వామపక్ష పార్టీల నాయకులతో పంచుకున్నారు. జిల్లా కేంద్రాల్లో నిర్వహించిన బహిరంగ సభలలో ఉద్యోగులు, కార్మికులు, ప్రజల భాగస్వామ్యంతో విజయవంతం అయ్యాయి.

పైడా వింగ్స్ వేదికపై మాట్లాడుతున్న సినీ నటుడు అల్లరి నరేష్

తారల సందడితో ముగిసిన పైడా వింగ్స్ 2- కె 23

ప్రజాశక్తి - తాళ్లరేవు

పైడా విద్యాసంస్థల ఆధ్వర్యంలో అట్టహాసంగా నిర్వహించిన పైడావింగ్స్ టూ కే 23 ఫెస్ట్ విద్యార్థుల కోలాహలం, సినీ తారల సందడితో ముగిసింది. ఈ సందర్భంగా విద్యార్థులకు క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, త్రో బాల్ వంటి పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. రాష్ట్రంలోని పలు ఇంజనీరింగ్, ఫార్మసీ కళాశాల నుంచి విద్యార్థులు హాజరై పలు రకాల ప్రాజెక్టులు ప్రదర్శించారు. విద్యార్థులు నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. పైడా అగ్రికల్చర్ విద్యార్థులు చేసిన రైతే రాజు అనే స్కిట్ అందరిని ఆకట్టుకుంది. ఇతర కళాశాల నుంచి వచ్చిన విద్యార్థులు తీసిన డాక్యుమెంటరీలు ప్రదర్శించారు. జెఎన్‌టియుకె డైరెక్టర్ కె.వెంకటరెడ్డి విద్యార్థులకు సందేశాన్ని ఇచ్చారు. అనంతరం వెంకటరెడ్డి పైడా విద్యాసంస్థల చైర్మన్ పైడా సత్యప్రసాద్, సెక్రటరీ శ్రీరామ్, జాయింట్ సెక్రెటరీ నిత్య శ్రీరామ్, డీన్ వీరభద్రరావు డి.డి. రవీందర్ రెడ్డి, ప్రిన్సిపాల్ సూర్యప్రకాశరావులతో కలసి పలు పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.

సినీ తారల సందడి

అల్లరి సినిమాతో హీరోగా అలరించి ఆ సినిమా పేరు ఇంటి పేరుగా మార్చుకుని నవ్వులతో అందరిని అలరించిన అల్లరి నరేష్ సీమటపాకాయ్ గా పేలి, కితకితలు, సుడిగాడు, బ్లేడ్ బాబ్జి సినిమాలతో ఎన్నో నవ్వులు పండించిన అల్లరి నరేష్ తన 60వ సినిమా ఉగ్రం ప్రమోషన్ లో భాగంగా పైడా లో జరుగుతున్న పైడావింగ్స్ కు విచ్చేసి విద్యార్థులతో సెల్ఫీలు దిగారు. అల్లరి నరేష్ రాకతో కళాశాల ప్రాంగణంలో సందడి నెలకొంది. అల్లరి నరేష్ వెంట ఉగ్రం చిత్రం హీరోయిన్ మిర్నామీనన్, సహనటుడు సాయి శ్రీనివాస్ కళాశాలలో సందడి చేశారు. ప్రేమ కథ చిత్రం, కల్కి వంటి చిత్రాల్లో నటించిన హీరోయిన్ నందిత శ్వేత కళాశాలలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమాల్లో విద్యార్థులతో కలిసి స్టెప్పులు వేశారు. ఇతర కళాశాలల ప్రిన్సి పాల్‌లు, ఫిజికల్ డైరెక్టర్ శ్రీనివాస్, అధ్యాపకులు రమేష్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

దువ్వాడ వద్ద మరమ్మతుల కారణంగా

నేటి నుంచి పలు రైళ్ల రద్దు

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

విశాఖపట్నం జిల్లా దువ్వాడ రైల్వే స్టేషన్ మెయిన్‌లైన్ వద్ద జరగుతున్న పనుల కారణంగా ఈ నెల 30వ తేదీ నుండి పలు రైళ్లను పూర్తిగా, పాక్షికంగా రద్దుచేస్తూ దక్షిణ మధ్య రైల్వే ఉన్నతాధికారులు ఆదేశాలు ఇచ్చారు. దీంతో విశాఖపట్నం-రాజమహేంద్రవరం మధ్య నడిచే 07467/66 పాసింజరు స్పెషల్ రైలు, అలాగే 17267/68 కాకినాడ- విశాఖపట్నం మధ్య నడిచే రైలు కూడా 30వ తేదీ ఆదివారం నుండి మే 7 వతేదీవరకూ రద్దుచేశారు.17220 విశాఖపట్నం-మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్ రైలును కూడా 30వ తేదీ నుండి మే 7 వ తేదీ వరకూ రద్దు చేశారు.17219 మచిలీపట్నం- విశాఖపట్నంల మధ్య నడిచే రైలు ఈ నెల 29 నుండి మే 6వ తేదీ వరకూ రద్దుచేశారు. 17479 పూర్తి-తిరుపతి ఎక్స్‌ప్రెస్ రైలును మే 5, మే 8 తేదీల్లో రద్దుపర్చారు. 17480 తిరుపతి- పూరి ఎక్స్‌ప్రెస్‌ను మే 5, 6 తేదీల్లో రద్దుచేశారు. 22701 విశాఖపట్నం-విజయవాడ ఎక్స్‌ప్రెస్‌ను మే 6వ తేదీన, 22702 విజయ వాడ-విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్‌ను మే6వ తేదీన రద్దుచేశారు. 12861 విశాఖపట్నం-కాచీగూడ ఎక్స్‌ప్రెస్‌ను మే 6,7 తేదీలు రెండు రోజులు రద్దుచేశారు. ఈ మేరకు సికింద్రాబాద్ ట్రాన్స్‌పోర్టేషన్ బ్రాంచి, హెడ్ క్వార్టర్స్ కార్యాలయం నుండి ఉత్తర్వులు ఆయా స్టేషన్లకు, డిఆర్‌ఎంలకు శనివారం సాయంత్రం జారీ చేశారు.

దళిత యువకుల మృతిపై నిష్పక్షపాతంగా విచారణ జరిపించాలి

ప్రజాశక్తి - కాజులూరు

ఇటీవల బయో డీజిల్ ట్యాంకర్ల పడి మృతి చెందిన దళిత యువకుల మృతిపై నిష్పక్షపాతంగా విచారణ జరిపించాలని అమలాపురం మాజీ ఎంపి హర్షకుమార్ డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని ఆర్యవటం శీల గ్రామాల్లో తాతపూడి మహేష్ శివకుమార్ల మతి చెందటంతో వారి కుటుంబ సభ్యులను హర్ష కుమార్ పరామర్శించి మాట్లాడారు. దళిత యువకుల మతిపై పలు అనుమానాలు వినిపిస్తు న్నాయని ఒక వర్గంను కాపాడేందుకు ప్రయత్నిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని దీనిపై పోస్ట్‌మార్టమ్ రిపోర్ట్ సక్రమంగా రాకపోతే రీ పోస్టుమార్టం చేసే విధంగా చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో కాజులూరు ఉప సర్పంచ్ దండంగి చిన్నారావు, వంగ శ్రీనివాస్ రాగం పోల రాజు బండి అబ్బులు పాల్గొన్నారు.

పోలీసులకు ఎస్‌పి ప్రశంస

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

ఇటీవల కాలంలో పలు ఇంటి దొంగతనం కేసులలో ముద్దాయిలను అరెస్టు చేసి సుమారు 40 లక్షల రూపాయలు విలువైన వెండి, బంగారు ఆభరణా లను మరియు నగదును రికవరీ చేసిన కాకినాడ జిల్లా క్రైమ్ అధికారులు, సిబ్బందిని జగ్గంపేట సర్కిల్ పోలీస్ అధికారులు, సిబ్బందిని జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ ఘనంగా సన్మానించారు. ఎస్ మురళీ మోహన్, డిఎస్‌పి దిశ పోలీస్ స్టేషన్ (పోలీసు ఉత్తమ సేవా పతకం), ఎస్‌కె అబ్దుల్ నబీ, ఇన్స్పెక్టర్ పెద్దాపురం పోలీస్ స్టేషన్ (పోలీసు సేవా పతకం), ఎ. సత్యనారాయణ, సబ్ ఇన్స్పెక్టర్, పిఠాపురం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్(పోలీసు సేవా పతకం), జె.రామస్వామి ఏఆర్‌ఎస్‌ఐ, కాకినాడ ఎఆర్ విభాగం (పోలీసు సేవా పతకం), కె సూరన్న , హెడ్ కానిస్టేబుల్ , పెద్దాపురం పోలీస్ స్టేషన్ (పోలీసు సేవా పతకం), పి.గణేష్, హెడ్ కానిస్టేబుల్, అన్నవరం పోలీస్ స్టేషన్ (పోలీసు సేవా పతకం) అందజేశారు

ఇంటి దొంగతనం కేసులలో రికవరీ చేసిన వారు : ఎస్ మురళీ మోహన్, డిఎస్‌పి దిశ పోలీస్ స్టేషన్, కాకినాడ, ఎస్. రాంబాబు డిఎస్‌పి క్రైమ్స్, కాకినాడ, బి.సూర్య అప్పారావు , సిఐ, జగ్గంపేట సర్కిల్, సిహెచ్ విద్యాసాగర్, సబ్ ఇన్స్పెక్టర్, జగ్గంపేట పోలీస్‌స్టేషన్, వై. గణేష్ కుమార్, సబ్ ఇన్‌స్పెక్టర్, గండేపల్లి పోలీస్ స్టేషన్, టీ.క్రాంతికుమార్, సబ్ ఇన్స్పెక్టర్, క్రైమ్స్ కాకినాడ, కె గోవిందరావు , క్రైమ్స్ కాకినాడ, జి.నరసింగ రావు, గండేపల్లి పోలీస్ స్టేషన్. మూర్తి, హెడ్ కానిస్టేబుల్ గండేపల్లి పోలీస్ స్టేషన్, జె.కాశీవిశ్వనాథం, పిసి గండేపల్లి పోలీస్ స్టేషన్, జె.వీరబాబు, పిసి, గండేపల్లి పోలీస్ స్టేషన్ ఎస్‌పి సతీష్ కుమార్ అభినందించారు.

గండేపల్లి ఎస్ఐ గణేష్ కుమార్‌కు ప్రశంసాపత్రాన్ని ఇస్తున్న ఎస్‌పి సతీష్‌కుమార్

ప్రశాంసాపత్రాలు అందుకున్న పోలీసు అధికారులతో ఎస్‌పి సతీష్‌కుమార్

దౌర్జన్యం కేసులో 56 మందిపై కేసు

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

తన భూమిలో శుక్రవారం అర్ధరాత్రి గ్రామానికి చెందిన వ్యక్తులు ప్రవేశించి దౌర్జన్యంగా కొబ్బరి మొక్కలు నరికి వేయడంతో పాటు ఇతర ఆస్తులకు నష్టం కలిగించారంటూ ఎన్.కొత్తపల్లికి చెందిన కోలా నరసింహమూర్తి శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. తనకు సంబంధించిన భూ వివాదం హైకోర్టులో ఉండగా దౌర్జన్యంగా భూమిలో ప్రవేశించి తనకు నష్టం కలిగించారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఫిర్యాదు మేరకు ఎస్ఐ జి. వెంకటేశ్వరరావు 56 మంది వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

అంగన్‌వాడీ హెల్పర్లకు నియామక పత్రాలు

ప్రజాశక్తి-రామచంద్రపురం

నియోజకవర్గ పరిధిలో గల అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీ పోస్టులకు ఇటీవల అర్హులను ఎంపిక చేశారు. వీరికి రాష్ట్ర మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ శనివారం నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపిపి అంబటి భవాని, ఐసిడిఎస్ అధికారి వి.వరాహ లక్ష్మి, సర్పంచ్ కొత్తపల్లి అరుణ పాల్గొన్నారు.

చలో విశాఖ పోస్టర్ విడుదల

ప్రజాశక్తి-అమలాపురం

మేడే కార్మిక దినోత్సవం సందర్భంగా రాష్ట్ర టిఎన్‌టియుసి కమిటి నిర్వహిస్తున్న చలో విశాఖ కార్యక్రమంలో భాగంగా అమలాపురం పార్లమెంట్ ఇంచార్జి గంటి హరీశ్ మాధుర్ బాలయోగి ఆధ్వర్యంలో పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం రాష్ట్ర టిఎన్‌టియుసి ఉపాధ్యక్షులు జోనల్ 2 ఇంచార్జి సబ్బతి ఫణిశ్వరరావు అధ్యక్షతన నిర్వహించారు.

మెగా సర్వే విజయవంతం

ప్రజాశక్తి-రాజానగరం

రాష్ట్రంలో 175 నియోజకవర్గాల్లో మెగా సర్వే విజయవంతం కావడానికి కారణమైన వైసిపి కార్యకర్తలందరికీ పాదాభివందనం చేస్తున్నామని ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు, ఎంఎల్ఎ జక్కంపూడి రాజా అన్నారు. రాజానగరం పార్టీ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. దీనిలో ప్రభుత్వం సంక్షేమ పథకాలు, కార్యక్రమాలు తదితర వాటి గురించి వివరించారు. నియోజకవర్గ పరిశీలకులు రాజశేఖర్,మండల కన్వీనర్ దూలం పెద్ద, జెడ్‌పిటిసి సభ్యులు వాసంశెట్టి పెద్ద వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో నగరం ఎడ్యుకేర్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-మామిడికుదురు

మామిడికుదురు మండలం, నగరం ఎడ్యుకేర్ జూనియర్ కళాశాలకు చెందిన ఇంటర్ సెకండ్ ఇయర్ విద్యార్థులు బుధవారం విడుదలైన ఫలితాలలో ఉత్తమ ఫలితాలు సాధించచారని కరెస్పాండంట్ కె. మురార్జి, డైరెక్టర్ కె. వాణి తెలిపారు. ఎంపిసి విభాగంలో వలవల పద్మ తేజ 1000 మార్కులకుగాను 982, చీకట్ల అనురాధ 978, అడబాల జ్యోతిక 975, షేక్ అమీన 975, ముత్యాల తేజస్వి 972, దారపురెడ్డి రేణుక 972, అడబాల గణేష్ కుమార్ 953, సిరిగినీడి అశ్రీత 953 అలాగే మరో 20 కి పైగా విద్యార్థులు 900 ఆపై మార్కులు సాధించారని చెప్పారు. అలాగే బైపిసి విభాగంలో కోళ్ల స్నేహ 940, మద్దుల మన్విత 935 సాధించారన్నారు. శనివారం విడుదలైన జె ఈ ఈ మెయిన్స్ 2023 ఎగ్జాంలో ముగ్గురు విద్యార్థులు 90కి పైగా పెర్సెంటైల్ ఉత్తమ ఫలితాలు సాధించారు. షేక్ అమీన 94.8, అడబాల జ్యోతిక 94.5, జిత్తుక పుష్పిత 93.89 పర్సంటేజ్ సాధించారని తెలిపారు.

ధాన్యం సొమ్ము సకాలంలో జమ చేయాలి

ప్రజాశక్తి-తాళ్లపూడి

రైతు పండించిన ధాన్యాన్ని ఆర్ బి కె ల ద్వారా రైతు మిల్లులకు తరలించిన తరువాత తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులను తొలగించి సకాలంలో డబ్బులు రైతుల ఖాతాలకి జమ చేసేలా చూడాలని పలువురు రైతులు అధికారులను కోరారు. తాళ్లపూడిలోని సింగులూరి సత్తిబాబు పొలంలో శనివారం అధికారులు వరి పంట కోత ప్రయోగం నిర్వహించారు. పంట ఎకరానికి 50 బస్తాలు దిగుబడి వచ్చినట్లుగా గుర్తించడం జరిగిందని గణాంక అధికారి జోడాల వెంకటేశ్వరరావు తెలిపారు. వ్యవసాయ సహాయకులు రేవతి ఆనంద్ తదితరులు రైతులు పాల్గొన్నారు.

అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆశయ సాధనకు యువత కృషి చేయాలని రాష్ట్ర మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. మలాపురం రూరల్ మండలం కామనగరువు పసిడిచెరువులో అంబేద్కర్ విగ్రహాన్ని శనివారం ఆయన ఆవిష్కరించారు. గ్రామ సర్పంచ్ నక్కా అరుణకుమారి చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రి పినిపే విశ్వరూప్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా యువత నడుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో దళిత ఐక్య వేదిక నాయకులు డిబి.లోక్, జాంగా బాబురావు, ఇసుకపట్ల రఘుబాబు, ఉండ్రు బాబ్జి, మెండు రమేష్ బాబు, పెయ్యాల శ్రీనివాస్, మాజీ సర్పంచులు రాజలపూడి భీముడు, నక్కా సంపత్, జెడ్‌పిటిసి సభ్యులు పందిరి శ్రీ హరి, గెడ్డం సంపత్‌రావు, ఎంపిటిసి సభ్యురాలు మెండు గంగా భవాని, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

పేరు మార్పు

తూర్పు గోదావరి జిల్లా, నిడదవోలు మండలం, నిడదవోలు పట్టణం, డి.నెం. 2-13-10/1, శాంతి నగర్ కాపురస్తులైన శ్రీ తాడిమళ్ళ వెంకట సాయి ఫణి శ్రీ చైతన్య, తండ్రి : గాంధి, అనువారికి మంజూరు చేసిన Disability Certificate నందు వీరి పేరు తాడిమళ్ళ వెంకట సాయి ఫణి శ్రీ చైతన్య కు బదులుగా తాడిమళ్ళ శ్రీ చైతన్య అని తప్పుగా నమోదు కాబడినది. కావున తాడిమళ్ళ వెంకట సాయి ఫణి శ్రీ చైతన్య మరియు తాడిమళ్ళ శ్రీ చైతన్య ఇద్దరూ ఒక్కరే అని ధృవపత్రం ఇప్పించవలసిందిగా దరఖాస్తు చేసియున్నారు.
సదరు విషయమై విచారణ చేయగా తాడిమళ్ళ వెంకట సాయి ఫణి శ్రీ చైతన్య మరియు తాడిమళ్ళ శ్రీ చైతన్య అనిన ఇద్దరూ ఒక్కరే అయివున్నారని ధృవీకరించడమైనది. ఈ ధృవపత్రం కోర్టు వివాదములకు వర్తించదు.